క్లుప్తంగా

ఉపాధి కల్పనకు జాబ్ మేళా



సత్తెనపల్లి: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురాం నగర్‌లోని విద్యా కేంద్రం కళాశాలలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 950 మంది యువత మేళాకు హాజరు కాగా, వివిధ కంపెనీల ప్రతినిధులు 300 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఎమ్మెల్యే అభినందించారు.

నేడు పీసపాడు, పారుపల్లిలో రెవెన్యూ సదస్సులు

క్రోసూరు: పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీసపాడు సచివాలయం వద్ద ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు, పారుపల్లి ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

గుంతలు పూడ్చిన సర్పంచ్



రాజుపాలెం: మాచర్ల–గుంటూరు రహదారికి ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ గుంతల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 13న గుంతలు పూడ్చండి–ప్రాణాలు కాపాడండి శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. మానవతా దృక్పథంతో స్పందించిన రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్ ఆదివారం తన పొక్లెయినర్‌తో రాజుపాలెం–రెడ్డిగూడెం మధ్య రోడ్డు గుంతలను పూడ్చారు. వాహనదారులు, ప్రజలు కృతజ్ఞలు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

ముప్పాళ్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై యు.సోమేశ్వరరావు తెలిపారు. సత్తెనపల్లి–నరసరావుపేట రోడ్డులోని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపటం నేరమని, తప్పని సరిగా నడిపే వ్యక్తి వద్ద లైసెన్స్ ఉండాలని సూచించారు. కారు నడిపే వారు కూడా సీటు బెల్ట్ ధరించాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రుల కూడా బాధ్యులవుతారన్నారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారికి అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో ఏఎస్సై మాధవరావు, నవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం

రెంటచింతల : వివాహిత మహిళ అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన సునీత అనే వివాహిత మహిళ ఈ నెల 18వ తేదీన బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై ఆమె భర్త పిచ్చయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా వీరికి నాలుగు నెలల క్రితం వివాహం అయిందని తెలిపారు. మహిళ తెనాలిలో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి తీసుకువచ్చి తల్లిదండ్రులకు ఆదివారం అప్పగించారు.

జూదరుల అరెస్ట్

విజయపురిసౌత్: స్థానిక శివ గణేష్ హోటల్ వెనుక ప్రదేశంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి రూ.3,580 నగదును స్వాధీన పరచుకొని నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను మాచర్ల కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవాలయంలో ఆదివారం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం జరిగి 16 రోజులు అయిన సందర్భంగా విశేషంగా వసంత కార్యక్రమం, పవళింపు సేవా కార్యక్రమం, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా శారదామాత జయంతి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో శ్రీ రామకృష్ణ సేవా మండలిలో ఆదివారం శారదామాత జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గండికోట విజయ్‌కుమార్ శర్మ నేతృత్వంలో శారదామాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదాలను, మిఠాయిలను పంపిణీ చేశారు. గుంటక కాశిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యల నడుమ చదువులు

- కేజీబీవీలో విద్యార్థినులకు పాముల భయం
- పాఠశాల వెనుక భాగంలో భారీగా పెరిగిన ముళ్ల పొదలు
- గతంలో పాము కాటుకు గురైన విద్యార్థిని
- నిలిచిన ఇంటర్మీడియెట్ భవన నిర్మాణం
- కూటమి ప్రభుత్వంలో ఆగిపోయిన పనులు



నకరికల్లులోని కేజీబీవీ పాఠశాల ప్రహరీకి అనుకుని భారీగా పెరిగి ఉన్న ముళ్ల పొదలు

నకరికల్లు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ చుట్టూ ముళ్ల పొదలు దట్టమైన అడవిని తలపిస్తున్నాయి. కేజీబీవీలో మండలంలోని పలు గ్రామాల విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 250 మంది విద్యార్థినులున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల వైపు ప్రహరీకి అనుకుని ఈ దట్టమైన ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. మరో వైపు అంతా పొలాలున్నాయి. పాములు, కీటకాల బెడద అధికమైంది. గతంలో ఓ విద్యార్థిని పాము కాటు గురై ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటనను ఇతర విద్యార్థినులు ఇంకా మరువ లేదు. రాత్రిళ్లు మరుగుదొడ్లకు వెళ్లేందుకు భయపడుతున్నారు. పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులు స్పందించి, ముళ్లపొదలు తొలగించాలని వారు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఇంటర్మీడియెట్ భవనం

కేజీబీవీలో అదనపు భవనం నిర్మాణం చేపట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు ఫేజ్–2 కింద ఇంటర్మీడియెట్ విద్యార్థినుల కోసం ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కొన్ని గదులకు స్లాబు కూడా పూర్తి చేశారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న భవనం నిర్మాణ ఊసే ఎత్తడం లేదు. పాత భవనంలోనే తరగతులు కొనసాగిస్తున్నారు. అయితే.. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన భవనంలో తరగతులు ప్రారంభించాలన్న ప్రణాళికతో పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్, ఎన్నికలు, ప్రభుత్వం మారడం లాంటి మార్పులతో భవనం నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. విద్యాశాఖ అధికారులు స్పందించి భవనాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.



మధ్యలోనే ఆగిపోయిన కేజీబీవి ఇంటర్ భవనం నిర్మాణపనులు

ఆర్యవైశ్యులు సమాజ సేవకులు

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ఆర్య వైశ్యులు సమాజ సేవకులని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య గో సంరక్షణ శాల కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం, పట్టణ ఆర్యవైశ్య, యువజన, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘాల ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఆర్యవైశ్యులు కష్టపడి సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు ఉపయోగించే అలవాటు ఉన్నవారన్నారు. ఆర్యవైశ్యుల సంఘం పేరుతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఆర్యవైశ్య సంఘాలతో తనకు ఎప్పటి నుంచో అనుబంధం ఉందని, ఉమ్మడి ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షుడిగా పడుచూరి వెంకటేశ్వర్లు, ఎంతో మంది ప్రముఖులు పనిచేశారన్నారు. సంఘాలన్నీ ఏకతాటిపై ఉండి సమాజ సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. నూతనంగా ఎన్నికైన వివిధ కార్యవర్గాల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం, ఆర్యవైశ్య నాయకులు పోతుగంటి రామకోటేశ్వర రావు, కొత్త లక్ష్మయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, జవ్వాజి రామ్మోహన్‌రావు, కటకం రామకృష్ణ, కొత్త రామకృష్ణ, బచ్చు వెంకటేశ్వర్లు(కొండలు), పెండ్యాల కాశీమల్లేశ్వరరావు, ఆత్మకూరి హరనాథ్, భవిరిశెట్టి శివరంజిత్‌కుమార్, అన్నం బాలసుబ్రహ్మణ్యం, చిల్లంచర్ల కల్యాణ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘాల బాధ్యులు

మరోసారి జగన్‌ను సీఎం చేసుకుందాం



6వ వార్డులో కేక్ కట్ చేస్తున్న గుంటూరు జానీ



రెంటపాళ్ళ ఎస్సీ కాలనీలో కేక్ కట్ చేస్తున్న వెంకటేశ్వర్లు

సత్తెనపల్లి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆ పార్టీ నాయకుడు గుంటూరు జానీ అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో ఆదివారం రాత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మహబూబ్‌వలీ, భాషా, బడేబాబు, ఆషిక్, మహమ్మద్ ఉన్నారు.

- పేదల పెన్నిధి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్నీ వర్గాల వారికి న్యాయం చేకూరిందని రెంటపాళ్ల మాజీ సర్పంచ్ కొర్లకుంట వెంకటేశ్వర్లు అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని రెంటపాళ్ల ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ ఏకుల మనీషా, నాయకులు పల్లె గాబ్రియేల్, ఏకుల ముత్తయ్య, తాటిమళ్ళ వెంకట్రావు, ఏకుల మరియదాసు, బిళ్ళనాని, వలపర్ల లక్ష్మణరావు, సాతులూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

అమిత్ షాను క్యాబినెట్ నుంచి తొలగించాలి

మహాజన దళిత సమితి నిరసన



అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేస్తున్న ఎండీఎస్ బాధ్యులు

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను క్యాబినెట్ నుంచి తొలగించాలని మహాజన దళిత సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దీపాల పరంధామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు.. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరంధామయ్య మాట్లాడుతూ అమిత్ షా వెంటనే భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అమిత్ షాను ఎన్నికల్లో పోటీ చేయనీకుండా నిషేధించాలని, దేశం నుంచి బహిష్కరించాలన్నారు. ఎండీఎస్ సీనియర్ నాయకులు పెద్దింటి నాగేశ్వరావు, చిలుకా రమణయ్య, యువజన నాయకులు ముదిగొండ ఈశ్వర్ మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు సిద్దేల మోహనరావు, గుంటూరు గోవిందు, జమండ్లమూడి ప్రభాకర్, గంగారాం, రవి, శివ కుమార్, సుధాకర్, పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించుకున్నారు. నాగవరం గ్రామం ఎస్సీ కాలనీ పార్టీ నాయకులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భారీ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పసుపులేటి అంకమరావు, వడ్లమూడి దేవదానం, మాదాసు ఆదినారాయణ, గాలంబాజీ, సయ్యద్ సుభాని తదితరులు పాల్గొన్నారు. పీసపాడు గ్రామంలోని వైఎస్సార్ విగ్రహ సెంటర్‌లో వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, విప్పల రాజశేఖరరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్



మాచర్ల: పట్టణంలోని గుడ్‌మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు 18, 13 వార్డులలో పర్యటించి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులు, కరెంటు స్తంభాలు కొత్తగా వేయడం తదితర సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాల జారీ చేసి పనులు చేయించారు.

హైందవ శంఖారావానికి తరలిరండి



మాట్లాడుతున్న పులిపాటి వెంకట పవన్‌కుమార్

అమరావతి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సనాతన హిందూ ధర్మం, దేవాలయాల రక్షణకు జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావానికి తరలి రావాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి పులిపాటి వెంకట పవన్ కుమార్ కోరారు. ఆదివారం స్థానిక సరస్వతీ శిశు మందిర్‌లో నిర్వహించిన హైందవ శంకారావ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో హిందువుల ఐకమత్యం కొరవడి, హైందవ ధర్మానికి విఘాతం కలుగుతోందన్నారు. రాజకీయాలకు, స్వార్థ ప్రయోజనాలకు వాడుకుని హిందువులు, హిందూ దేవాలయాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువుల చైతన్యం కోసమే శంకారావం నిర్వహస్తున్నామన్నారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోలా వెంకటేశ్వరరావు, వారణాశి వెంకటేశ్వరశర్మ, కౌశిక ప్రసాద్ తదితరులు ప్రసగించారు.

సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు

విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో భక్తులు

విజయపురిసౌత్: విశ్వాసంతో క్రీస్తును ఆరాధిస్తూ సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు తప్పకుండా ఉంటాయని సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. విజయపురిసౌత్‌లోని పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. దీనికి ముందు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

క్రీస్తుని స్తుతించటమే నిజమైన క్రిస్మస్

దాచేపల్లి : క్రీస్తుని స్తుతించటమే నిజమైన క్రిస్మస్ అని హైదరాబాద్‌కి చెందిన పాస్టర్ డాక్టర్ గొల్లపల్లి మోజెస్ అన్నారు. ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా కేక్‌ని స్థానిక సంఘ కాపరి రెవ. తగరం ప్రేమయ్యతో కలిసి పాస్టర్ మోజెస్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మోజెస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితాలు సంతోషంగా ఉండాలంటే పూర్ణ హృదయంతో క్రీస్తుని ఆరాధించాలన్నారు. క్రీస్తుని ఆరాధించిన వారి జీవితాలు ఆనందమయంగా ఉంటాయని చెప్పారు. విశ్వాసంలో సడలిపోకుండా క్రీస్తు రాకడని కనిపెట్టుకుని జీవించాలని, క్రీస్తు ద్వారానే పరలోకరాజ్య మోక్షం లభిస్తుందని పాస్టర్ మోజెస్ అన్నారు. సండేస్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీస్తు పుట్టుక నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగెండ్ల రత్నం, నాగెండ్ల ఏసయ్య, నాగెండ్ల యాకోబు, మాతంగి రాంబాబు, పత్రా రమేష్, పత్రా ఆనందరావు, నాగెండ్ల మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.



ప్రసంగిస్తున్న పాస్టర్ మోజెస్

మండల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జనవరి 3వ తేదీన ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు షేక్ జానీ, సన్ని ఆదివారం తెలిపారు. కన్నెగంటి భార్గవ్ నాయకుడు జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.22,222, రెండవ బహుమతి రూ.17,777, మూడవ బహుమతి రూ.12,222తో పాటు షీల్డ్‌లను అందజేయనున్నారు. క్రీడాకారులు రూ.149తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. టీమ్ కెప్టెన్ ఎంట్రీ కోసం రూ.1,999 చెల్లించాలన్నారు. ఈ క్రికెట్ పోటీల కోసం ఈ నెల 25వ తేదీ ఆక్షన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్ టోర్నమెంట్ జనవరి 3వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. క్రికెట్ ఆటగాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరన్ని వివరాల కోసం 9502300411, 8522999880 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ పిడుగురాళ్ల పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు పనులు కొనసాగింపు



కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు

అచ్చంపేట: మాదిపాడు నుంచి జడపల్లి తండా, కంచుబోడు తండాలను కలుపుతూ పులిచింతల ప్రాజెక్టు ఘాట్ రోడ్డు వరకు సుమారు 6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగం పుంచుకున్నాయి. మాదిపాడు నుంచి కంచుబోడు తండా, జడపల్లి తండా వరకు పక్కా రోడ్డు వేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.3.50కోట్లు నా బార్డు నిధులు మంజూరు అయిన విషయం తెలిసిందే. అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రోడ్డు నిర్మాణానికి మాదిపాడు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కొంతమేర గ్రావెల్, డస్ట్‌తో రోడ్డు వేశారు. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులను అధికారులు తిరిగి వేగవంతంగా కొనసాగించడం పట్ల తండా వాసులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుకు గ్రావెల్, డస్ట్ వేసి, తారువేస్తున్నారు. మరో పది పదిహేను రోజుల్లో పూర్తి కావచ్చు. కంచుబోడు తండా, జడపల్లి తండాల వద్ద ఉన్న లో లెవల్ చప్టా పనులను కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా కల్యాణ్



చిల్లంచర్ల కల్యాణ్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా చిల్లంచర్ల కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య గో సంరక్షణ శాల కల్యాణ మండపంలో ఆదివారం తనతో పాటు యువజన సంఘం బాధ్యులందరి చేత ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షుడిగా కొత్త రామకృష్ణ, గౌరవ సలహాదారులుగా పెరుమాళ్ల అమర్, బచ్చు మురళీకృష్ణ, యక్కల సతీష్ కుమార్, మద్ది రాజేష్ బాబు, ఉపాధ్యక్షులుగా జవ్వాజి రవికృష్ణ, ఆకి కిరణ్‌కుమార్, గుంటూరు హరీష్, దేవతి పవన్, కార్యదర్శిగా కొత్తూరి హరి మణికంఠ, సహాయ కార్యదర్శులుగా వనమా రాజేష్, దొడ్లా తరుణ్, భవిడిశెట్టి సాయి, బాల నాగు రామారావు, కోశాధికారిగా దేసు రాజేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నాళం మణితేజ, బచ్చు గణేష్, మీడియా ఆర్గనైజర్స్‌గా దివ్వెల సతీష్‌కుమార్, కొప్పురావూరి ప్రసాద్ ఆదిత్య, మరో 13 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చిల్లంచర్ల కల్యాణ్‌ను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

రెంటచింతల: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో, రెంటాలలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో, తుమ్మకోట గ్రామంలోని జనార్ధనస్వామి ఆలయంలో ఆదివారం వేకువ జాము నుంచి భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎంతో పవిత్రమైన ధనుర్మాసంలో గోదాదేవికి విశేష పూజలు నిర్వహించడం సంప్రదాయం. ఆయా గ్రామాలలోని ఆలయ పరిసర ప్రాంతాలలో వేకువజాము నుంచి గోవింద నామస్మరణ మార్మోగింది. స్వామి వార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉద్యానహీనం!



పార్కులోని ఊయల దుస్థితి

వినుకొండ(నూజెండ్ల): ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కులు అధికారుల నిర్లక్ష్యం వలన నిరుపయోగంగా మారుతున్నాయి. మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో ఉన్న ఉద్యానవనం నేడు ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. 2018లో ఉపాధి పథకం నిధులు రూ.8.43 లక్షలతో పార్కును నిర్మించారు. అధికారుల ముందు చూపు లేకపోవటంతో చుట్టుపక్కల పొలాల్లోని నీరు పార్కులోకి చేరి దుర్గంధం వెదజల్లుతుంది. రాత్రిళ్లు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారింది. అంతేకాక గేదెలు, జంతువులు పార్కులో స్వైర విహారం చేస్తుంటాయి. ఉద్యానవనంలో జాతీయ నాయకులు విగ్రహాలను ఉయ్యల జారుడు బల్లలను దాతలు వితరణ చేసిన బెంచీలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. రూ.లక్షలతో నిర్మించిన ఉద్యానవనం అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వలన ఈ దుస్థితికి వచ్చిందని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పార్కును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం కృషి చేస్తుందని పలువురు వక్తలు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 75 సంవత్సరాలు వయస్సు పూర్తిచేసుకున్న 35 మంది పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ కంచుపర్తి సత్యనారాయణ, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాద్, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. తొలుత పెన్షనర్స్‌డే ప్రారంభకులు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల మృతి చెందిన అసోసియేషన్ సభ్యులకు శ్రద్ధాంజలి ఘటించారు.